ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

శనివారం 26 ఏప్రిల్ 2025



కరీంనగర్ మార్గంలో..
రేపు వాహనాల దారి మళ్లింపు
• బీఆర్ఎస్ ఆవిర్భావ సభ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసుల చర్యలు 6

సంరంభానికి.. సన్నద్ధం

రజతోత్సవానికి సిద్ధమైన బీఆర్ఎస్ శ్రేణులు

'గులాబీ' ఆవిర్భావ సంరంభానికి సర్వం సన్నద్ధమైంది. రజతోత్సవ వేడుకలకు ఓరుగల్లు ముస్తాబవుతోంది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు టీఆర్ఎస్‌గా ఏర్పడి.. నేడు బీఆర్ఎస్‌గా రూపాంతరం చెంది. గులాబీ పార్టీ 25ఏళ్ల పండుగను ఘనంగా జరుపుకునేందుకు శ్రేణులు సిద్ధమయ్యాయి. ప్రతీ ఊరు, వాడ నుంచి జనాన్ని సమీకరించి, చరిత్రలో నిలిచేలా ఆవిర్భావ రజతోత్సవ సభను నిర్వహిస్తామని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 50వేల మందికి తగ్గకుండా జనసమీకరణ చేసేలా కృషి చేయాలని అధిష్ఠానం ఆదేశాలిచ్చిన నేపథ్యంలో నెల రోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గం, మండల కేంద్రాలతో పాటు పట్టణాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో లక్షలాదిగా జనాన్ని తరలించి, రజతోత్సవ వేడుకలను అట్టహాసంగా విజయవంతంగా నిర్వహించాలని బీఆర్ఎస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఇక ఆదివారం ఎల్కతుర్తి వేదికగా జరగనున్న రజతోత్సవాల సభకు తరలేందుకు గులాబీ దళం వివిధ రూపాలను ఎంచుకున్నారు.

- రేపటి ఎల్కతుర్తి సభకు తరలేందుకు సన్నాహాలు
- పాటలు, ఎడ్లబండ్ల ర్యాలీలు, పాదయాత్రలతో మొదలైన సందడి
- సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఓరుగల్లు నేతలు
- ప్రతీ నియోజకవర్గం నుంచి 50వేలకు తగ్గకుండా జనసమీకరణకు కసరత్తు
- నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు



సిద్ధమైన సభ ప్రాంగణం



జెండాలు, ఫ్లెక్సీలతో ముస్తాబైన ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారి



గీసుగొండ మండలం కొమ్మాల నుంచి సభకు తరలొస్తున్న ప్రభబండి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు అధిష్ఠానం ఉమ్మడి వరంగల్‌పై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. తెలంగాణ ఉద్యమానికి మొదటి నుంచి అండగా నిలుస్తున్న వరంగల్ నుంచి భారీగా జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టింది. మొత్తం 12నియోజకవర్గాల నుంచి 2.50లక్షల నుంచి 3లక్షల వరకు జనాన్ని తరలించాలని దిశానిర్దేశం చేసింది. వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, పరకాల, వర్ధన్నపేట, భూపాలపల్లి, నర్సంపేట, స్టేషన్‌ఘనపూర్, జనగామ జిల్లాల నుంచి 50వేల నుంచి 75వేల వరకు, పాలకుర్తి, మహబూబాబాద్, డోర్నకల్, ములుగుతో పాటు వీలిననియోజవర్గాల నుంచి 30వేల నుంచి 50వేల వరకు జనాన్ని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సమాచారం. అయితే మొన్నటి వరకు విభేదాలతో అటుఇటుగా ఉన్న నేతల మధ్య ఇటీవల కేటీఆర్ పర్యటనతో సమన్వయం కుదిరిందని, దాంతో వారంతా కలిసికట్టుగా ముందుకు వెళ్లుతున్నారనే చర్చ జరుగుతోంది. సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. సన్నాహక సమావేశాలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, సత్యవతిరాథోడ్, రెడ్యా నాయక్, మాజీ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, గండ్ర వెంకటరమణారెడ్డి, నన్నపనేని నరేందర్, శంకర్‌నాయక్, బడే నాగజ్యోతి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించిన

మిగతా 7వ పేజీలో..

పాటలు, ఎడ్ల బండ్ల ర్యాలీలతో గ్రామాల్లో జోష్

ప్రతీ ఊరు, వాడ నుంచి జనసమీకరణ చేయాలని నిర్ణయించుకున్న నేతలు.. నాటి తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలను పాటలుగా చేసుకుని కవులు,కళాకారులు రూపొందించిన రజతోత్సవ వేడకల పాటల సీడీలను ఆవిష్కరిస్తూ జనాల్లోకి వెళుతున్నారు. భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి రూపొందించిన చలో ఓరుగల్లు పాటల సీడీని ఇటీవల ఎల్కతుర్తిలో కేటీఆర్ ఆవిష్కరించగా, ఎనుగుల రాకేష్‌రెడ్డి తయారు చేయించిన ఎగిసేర భలే ఎగిసేర.. సారే రావాలంటూ ఓరుగల్లు పిలిచేరా.. అనే పాటల సీడీని ఎమ్మెల్సీ కవిత ఆవిష్కరించారు. ఇలా ఓరుగల్లులో ప్రతి నియోజకవర్గంలో పాటలతో గులాబీ శ్రేణులు పల్లెలను హోరెత్తిస్తున్నాయి. వీటితో పాటు గులాబీ శ్రేణుల్లో జోష్ తీసుకొచ్చేలా ఎడ్లబండ్ల ర్యాలీలు నిర్వహిస్తున్నారు. రజతోత్సవ వేడుకలకు జాతర తరహా లుక్ వచ్చేలా దృష్టి పెడుతున్నారు. సూర్యాపేట నుంచి వరంగల్ వరకు ఎడ్లబండ్లపై ర్యాలీగా గులాబీ కార్యకర్తలు తరలి రాగా, వర్ధన్నపేట నుంచి 500 ఎడ్లబండ్లతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సైతం భారీ ర్యాలీ చేపడుతున్నారు. ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి బీఆర్ఎస్ నేతలు పాదయాత్రగా వస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాల్లో పలు గ్రామాల్లో మహిళ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గులాబీ పండుగకు రావాలని మహిళలకు బొట్టు పెడుతూ... కరపత్రాలను ఇంటింటికి పంచుతూ.. రజతోత్సవ సభకు ఆహ్వానిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రధాన రహదారుల వెంట ఫ్లెక్సీలు, వాల్ రైటింగ్‌లతో గులాబీమయం చేస్తున్నారు.

లక్షలాదిగా జనసమీకరణ చేస్తున్నాం



బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ ప్రసంగాన్ని వినేందుకు లక్షలాదిగా జనం తరలి వస్తారు. బీఆర్ఎస్ 25ఏళ్ల ప్రస్థానంలో 14ఏళ్లు తెలంగాణ రాష్ట్రం కోసంఉద్యమించాం. 10ఏళ్లు అంబేద్కర్ ఆలోచన విధానంతో పరిపాలన చేశాం. 16 నెలలుగా ప్రజల ఇచ్చిన తీర్పుతో ప్రతిపక్షంగా ప్రజల సమస్యలపై పోరాటం చేస్తున్నాం. బీఆర్ఎస్‌కు ప్రజలు ఏ బాధ్యతను ఇచ్చినా నిర్వహిస్తున్నాం. తెలంగాణ ప్రజల కోసం పుట్టిన ఇంటిపార్టీ బీఆర్ఎస్. ఈ గులాబీ పండుగకు ఎన్ని లక్షల మంది వచ్చినా సరిపడేలా ఏర్పాట్లు చేశాం.

- దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు

ప్రతీ పల్లె నుంచి జనం తరలొస్తున్నరు



గులాబీ పండుగకు ప్రతీ పల్లె నుంచి జనసమీకరణ చేస్తున్నాం. రాష్ట్రంలోని 12,750 గ్రామాల నుంచి ప్రజలు సభకు వస్తారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాల నుంచి భారీగా జనసమీకరణ చేపట్టాం. 1,250 ఎకరాల్లో సభ ఏర్పాట్లు చేశాం. కేసీఆర్‌ను చూసేందుకు.. ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఉండేది గులాబీ జెండా.. కేసీఆర్‌నే. బీఆర్ఎస్ రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా లక్షలాదిగా ప్రజలను తరలిస్తున్నాం.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే జనగామ

క్రైం కార్నర్

పంట నష్టం.. ప్రాణం తీసింది..

- గడ్డి మందు తాగి రైతు ఆత్మహత్య



రాజయ్య (ఫైల్)

కాటారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టం చేసిన రైతుకు పంట నష్టం రావడంతో తల్లడిల్లిపోయాడు.. ఓ వైపు చేసిన అప్పులు.. ఇటు పంట దిగుబడి రాక చివరకు ఆత్మార్పణం చేసుకున్నాడు. అతడికి పురుగుల మందే పెరుగున్నమయింది.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని గుండ్రాత్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల మల్లారం గ్రామానికి చెందిన దుర్గం రాజయ్య(55)అనే రైతు పంట నష్టం, అప్పుల బాధతో జీవితంపై విర క్తిచెంది గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీనివాస్, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజయ్య వెంకటమ్మ దంపతులకు కొడుకు నాగరాజు, కూతురు ఉండగా ఇద్దరికీ వివాహం చేశారు. రాజయ్య తమకున్న నాలుగెకరాల భూమిలో కొడుకుతో కలిసి వ్యవసాయం చేస్తూ పత్తి, వరి పంట లు సాగుచేస్తున్నాడు. ఈ ఏడాది పత్తి పంట ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్లతో సరిగా దిగుబడులు రాలేదు. దీంతో రూ.1.20లక్షల మేర నష్టం వాటిల్లి అప్పు అయింది. వరిపొలం కూడా నీళ్లు సరిగా అందక కొంతమేర ఎండిపోయింది. దీంతో గత నెల రోజులుగా రాజయ్య మనస్తాపం తో విపరీతంగా మద్యం సేవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి రాజయ్య మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో ఇంటి వద్ద ఉన్న గడ్డి మందును తాగి అస్వస్థత పాలయ్యాడు. దీంతో కుటుంబసభ్యులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుడి కొడుకు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



వాహనం ఢీకొని కింద పడి ఉన్న అనిల్

మహదేవపూర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన మహదేవపూర్ మండల సమీపంలో అన్నారం డేంజర్ క్రాస్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం మంథని మండలం కాన్సాయిపేట గ్రామానికి చెందిన కుడుదల అనిల్(20) అనే యువకుడు మహదేవపూర్ నుండి కాళేశ్వరం బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో అన్నారం డేంజర్ మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. తీవ్రంగా గాయపడిన యువకుడిని స్థానికులు గమనించి 108 వాహనం ద్వారా మహదేవపూర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అనిల్ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెవీ మోటార్ వెహికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఏటూరునాగారం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ పరిధిలో గల గిరిజన నిరుద్యోగ యువతకు హెవీ మోటార్ వెహికల్ నందు ఇవ్వనున్న ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని జోనల్ స్టాఫ్ ట్రెయినింగ్ సెంటర్ నందు 30రోజులపాటు ఉచిత భోజనం, వసతితోపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి ఉన్న గిరిజన అభ్యర్థులు సంబంధిత జీరాక్స్‌కాపీలతో మే 2వతేదీలోపు ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9490341911 నంబర్‌ను సంప్రదించాలని ఆమె వివరించారు.

భూ భారతి చట్టంతో భూ సమస్యల పరిష్కారం

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రేగొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం అమలుతో రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న అన్ని భూ సమస్యలు పరిష్కారమవుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక గ్రామాల్లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం భూ భారతి చట్టం పైలెట్ ప్రాజెక్టుగా నాలుగు మండలాల్లో అమలు చేస్తున్నారని తెలిపారు. ఏమైనా లోపాలు సలహాలు ఉంటే మార్పులు చేసి జూన్ రెండు నుంచి రాష్ట్రమంతటా అమలు చేయనున్నారని అన్నారు. ధరణిలో పొరపాట్ల కారణంగా పట్టా కాకపోవడంతో రైతు బీమా, రైతు బంధు రాలేదని విమర్శించారు. ధరణి తీసుకొచ్చి అధికారులకు అధికారాలు లేకుండా చేశారని అన్నారు. భూ భారతిలో మాత్రం తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్‌లకు అధికారాలు ఇచ్చారన్నారు. ఈ చట్టం ద్వారా తక్షణం రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు ఆ భూమికి నక్ష కూడా ఉంటుం దన్నారు. భూమికి భూదార్ కార్డు అందజేసి భూ అక్రమాలకు అవకాశం లేకుండా చేయడమే ధ్యేయంగా భూభారతి చట్టం ఉంటుందన్నారు. భూ భారతి పోర్టల్‌లో 30 మాడ్యూల్‌లు ఉన్నాయని భూసమస్యను బట్టి సంబంధిత మాడ్యూల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీ ఏడాది డిసెంబరు 31వ తేదీన రికార్డుల నవీకరణ చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సమావేశంలో 54మంది లబ్ధిదారులకు రూ.22,25,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. రేగొండ, కొత్తపల్లిగోరి మండలాలలోని పలు గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. తహసీల్దార్ శ్వేతారావు, జిల్లా ఉద్యాన అధికారి సునీల్, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్ఞన్‌రావు పాల్గొన్నారు.

● భూపాలపల్లి కలెక్టరేట్ ధాన్యం కొనుగో లులో ఎవరు తప్పుచేసిన ఉపేక్షించేది లేదని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి డీఎస్ఓ, డిఆర్డీఏ,సహకార, వ్యవసాయ, సింగిల్ విండో చైర్మెన్,ట్రాన్స్‌పోర్టర్లతో సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కలిసి యాసంగి ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. గన్ని సంచుల కేటాయింపుల్లో తప్పులు జరగకుండా చూసుకో వాలని డిఎంను ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డిఎస్ఓ శ్రీనాథ్, డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలకు భూ భారతితో మోక్షం



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎమ్మెల్యే వెంకట్రావ్

వాజేడు/వెంకటాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ధరణి కారణంగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న రైతు భూ సమస్యలకు భూ భారతి చట్టం ద్వారా మోక్షం కలుగనుందని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం వాజేడు, వెంకటాపురం మండలాల్లో ఆయన పర్యటించారు. పాత్రాపురం రైతువేదికలో జరిగిన భూ భారతి నూతన ఆర్వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతుల పాలిట శాపంగా మారిందని, ఏ తప్పు చేయకుండానే రైతులు, అధికారులను ధరణి దోషులుగా నిలబె ట్టిందని అన్నారు. ఈనేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన ఆర్వోఆర్ చట్టాన్ని రూపొందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నూతనంగా భూ భారతి చట్టాన్ని అమలులోకి తీసుకువచ్చారని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ద్వారా పేరు కుపోయిన భూ సమస్యలన్ని పరిష్కారమవుతాయని తెలిపారు. ములుగు కలెక్టర్ టీఎస్. దివాకర మాట్లాడుతూ కొత్త చట్టం వల్ల రైతులు, ప్రజలకు చేకూరే ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ధరణి రికార్డులను భూభారతిలో నమో దు చేయడం జరుగుతుందని తెలిపారు. సాదా బైనా మా దరఖాస్తులను కొత్త చట్టంలో ఆర్డీవోలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని అన్నా రు. అనం తరం ఎమ్మెల్యే వెంకట్రావ్ 15మంది లబ్ధిదారు లకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. వాజేడు మండలంలోనూ చెక్కు ల పంపిణీ చేశారు. ఈ సదస్సులో మండల ప్రత్యేక అధికారి అప్పలనాయుడు, తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, మండల వ్యవసాయ అధికారి నవీన్, అధికారులు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పదేళ్లలో ఏం ఒరగబెట్టారో ప్రజలకు చెప్పండి

6లో..

- వారిని మెప్పించి ఆపై సభ జరుపుకోండి
- అంతేకానీ మాపై చిందులు వేయడం సరికాదు
- అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారు
- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ముఖ్య నేతల ఫైర్
- రజతోత్సవ సభను బహిష్కరించాలంటూ పిలుపు



మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

ఇప్పపువ్వు సేకరణతో వేసవి ఉపాధి..


ఇప్పపువ్వు సేకరిస్తున్న గిరిజనులు

- ఏజెన్సీలో గిరిజనులు బిజీ బిజీ
- దక్కని గిట్టుబాటు ధర, తగ్గుతున్న ఆసక్తి
- ఐటీడీఏ ద్వారా పువ్వు కొనుగోలు చేయాలని డిమాండ్

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందం టే చాలు ఏజెన్సీ గిరిజనులు ఇప్పపువ్వు సేకరణలో బిజీగా ఉంటారు. ములుగు జిల్లా ఏటూరునాగారం ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం ఈ ఇప్పపువ్వు సేకరణ జోరుగా జరురగుతోంది. వారికి ఈ వేసవి కాలంలో ఉపాధి వనరుగా నిలిచే ఇప్పపువ్వు కోసం ఉదయం నుంచే గిరిజనులు తమ పిల్లలతో కలిసి అడవుల్లోకి వెళ్తారు. పువ్వులను ఏరి, వాటిని బుట్టల్లో నింపుకుని మధ్యాహ్నానికి ఇంటికి చేరుకుని.. వాటిని కొద్దిరోజుల పాటు ఎండబెట్టి విక్రయానికి సిద్ధం చేస్తారు. ఈ ప్రక్రియలో మహిళలు, పురుషులు, చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అయితే తాము సేకరిస్తున్న ఇప్పపువ్వుకు సరైన ధర లభించడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల తమ కష్టానికి తగిన ప్రతిఫలం దక్కడం లేదని, ఈ నేపథ్యంలో సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) ద్వారా నేరుగా ఇప్పపువ్వును కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఐటీడీఏ ద్వారా కొనుగోలు చేస్తే దళారుల దోపిడీ ఉండదని, తమకు కొంతైనా ఆదాయం లభిస్తుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి, ఏజెన్సీలో ఇప్పపువ్వు సేకరణతో కొంత ఉపాధి లభిస్తున్నప్పటికీ, సరైన ధర లేకపోవడం గిరిజనులను కలవరానికి గురిచేస్తోంది. అంతేకాకుండా వేసవిలో ఎలాంటి పనులు దొరకక పస్తులుంటున్న గిరిజనులకు ఇప్పపువ్వు సేకరణ మంచి ఉపాధిని కల్పిస్తోంది. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా వారం రోజులుగా గిరిజనులు అడవుల బాట పట్టి.. ఇప్పపువ్వు సేకరిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రతి వేసవికాలం ఏప్రిల్, మే నెలల్లో ఇప్పపువ్వులను సేకరించి ఇళ్ల ఎదుట వాకిట్లో ఆరబోస్తారు. వారం రోజుల పాటు ఎండలో ఎండబెట్టిన తర్వాత గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి వాటిని విక్రయిస్తారు. అలా కిలోకు సుమారు రూ.20 నుంచి రూ.50వరకు ధర పలుకుతుంది. ఒక్కో కుటుంబం రోజుకు రూ.400 నుంచి రూ. 500 వరకు ఉపాధి పొందుతోంది. ములుగు జిల్లా ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, వాజేడు, వెంకటాపురం


ఇప్పపువ్వు తెస్తున్న గిరిజనులు

ఏజెన్సీ మండలాల్లో సుమారు 40 నుంచి 60 వరకు గొత్తికోయ గూడేలు ఉండగా సుమారు 4,500 మంది గిరిజనులు నివాసం ఉంటున్నారు. వారిలో సగానికి పైగా గిరిజనులు వేసవిలో ఇప్పపువ్వు సేకరణ, విక్రయంపై ఆధారపడుతున్నారు. ఇక ఇప్పపువ్వుతో తయారు చేసే సారాయికి కూడా మంచి గిరాకీ ఉంటుంది.



దైవంగా భావిస్తారు..

గిరిజనులు ఇప్ప చెట్టును దేవతగా.. ఇప్పపువ్వును ప్రసాదంగా భావిస్తారు. అందుకే ఆ చెట్లకు నిత్యం పూజలు చేస్తుంటారు. గిరిజనులు ఎప్పటికీ ఇప్పపువ్వుల చెట్లను వారి ఇంటి చుట్టుపక్క ప్రాంతాల్లోనే ఉంచుకుంటారు. ఇప్ప చెట్లను ధ్వంసం చేయకుండా, చెట్లపైకి ఎవరినీ ఎక్కకుండా చూసుకుంటారు.

అనేక రకాలుగా వినియోగం

ఇప్పపువ్వులను చిక్కుడు గింజలు, అలసందలతో కలిపి ఉడికించి అంబలి కాసుకుంటారు. నీటిలో ఉడకబెట్టి ఆహారంగా తింటారు. ఈ పువ్వులను నుంచి తీసిన తైలాన్ని పక్షవాతం తదితర వ్యాధులకు వాడతారు. ఇప్పపువ్వుల నుంచి నూనెను తయారు చేసి వారు తినే వంటలతో పాటు దీపాలకు వాడతారు.

దక్కని గిట్టుబాటు ధరలు...

ఇప్పపువ్వులకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో ప్రస్తుతం వీటి సేకరణపై గిరిజనుల ఆసక్తి ఏటా తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం ఇప్పపువ్వును జీసీసీకి కిలో రూ. 30 చొప్పున కొనుగోలు చేస్తుండగా.. బయట మార్కెట్‌లో కిలోకు రూ. 50 చెల్లిస్తున్నారని గిరిజనులు చెబుతున్నారు. కిలో ఇప్పపువ్వుకు జీసీసీ రూ. 50 చొప్పున గిట్టుబాటు ధర కల్పించాలని గిరిజను లు డిమాండ్ చేస్తూన్నారు. ఒక్క కుటుంబంలో ఇప్పపువ్వుల సీజన్‌లో సుమారు 10 క్వింటాల నుంచి 20 క్వింటాల వరకు ఇప్పపువ్వును సేకరించి ఉపాధి పొందుతున్నారు. ఇప్పటికైనా జీసీసీ అధికారలు స్పందించి కిలో ఇప్పపువ్వుకు కనీసం రూ. 50ల చొప్పున మద్దతు ధర కల్పించాలని కోరుతున్నారు. అలా అయితే.. ఒక్క కుటుంబం నుంచి రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు లాభం పొందుతారు.


సేకరించిన ఇప్పపువ్వును వాకిట్లో ఎండపోస్తున్న గొత్తికోయ మహిళ

కల్వకుంట్ల కుటుంబసభ్యుల మాటలు నమ్మరు

- తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో పదేళ్లు అధికారంలోకి ఉండి, అందినకాడికి దోచుకున్న మాజీ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కుటుంబసభ్యుల మాటలు ప్రజలు నమ్మరని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ కూరపాటి వెంకటనారాయణ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నమ్మినాన బోస్తే.. పుచ్చి బూర్రలు అయినట్లు గా ప్రజలు రెండుసార్లు అధికారమిస్తే కేసీఆర్ తెలంగాణ ప్రజలపై తీవ్ర నిర్బంధాలను అమలు పరిచి, అందినకాడికి దోచుకున్నారని విమర్శించారు. అనేక మంది త్యాగాలతో తెలం గాణ రాష్ట్రం ఏర్పడిందని చెప్పారు. దళితులకు ముఖ్యమంత్రి ఇస్తానని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారని విమర్శించారు. గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాలకు వేలకోట్ల రూపాయల పెట్టుబడులు తరలించి, ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిని విస్మరించారని వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థలకు నిధులు ఇవ్వకుండా విధ్వంసం చేశారని మండి పడ్డారు. ఎల్కతుర్తి సభను ప్రజలు, ఉద్యమకారులు వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు కె.శంకర్, పి.కృష్ణారావు, బిక్షం, మల్లేశం, అనిల్, మహేష్ పాల్గొన్నారు.

కరీంనగర్ మార్గంలో ...
రేపు వాహనాల దారి మళ్లింపు


ఏసీపీ సత్యనారాయణ

వరంగల్ క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఉన్న నేపథ్యంలో ఆదివారం ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కరీంనగర్, సిద్దిపేట నుంచి హనుమకొండకు వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు వరంగల్ ట్రాఫిక్ ఏసీ పీ సత్యనారాయణ తెలిపారు. వాహన దారులు పోలీసులు సూచించిన మార్గాల్లోనే ప్రయాణించి ట్రాఫిక్ అంతరా యం కాకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మళ్లించిన రూట్లు..

1 కరీంనగర్ నుంచి హనుమకొండ వైపు హుజురాబాద్ నుంచి వచ్చే వాహనాలు పరకాల క్రాస్ రోడ్డు, ఉప్పల్, కమలాపూర్, అంబాల, ముచ్చర్ల క్రాస్ రోడ్డు, ఓఆర్ఆర్ మీదుగా నగరంలోకి చేరుకోవాలి.

2. వరంగల్, హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు...

తిరుగు ప్రయాణంలో హనుమకొండ ముచ్చర్ల క్రాస్‌లోని నూతనంగా నిర్మించిన ఓఆర్ఆర్ రోడ్డు నుంచి అంబాల, కమలాపూర్, ఉప్పల్, పరకాల క్రాస్ రోడ్డు, హుజురాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లాలి.

3. సిద్దిపేట నుంచి హనుమకొండ: సిద్దిపేట వయా జనగాం, హనుమకొండకు చేరుకోవ చ్చు. తిరుగు ప్రయాణంలో హనుమకొండ నుంచి సిద్దిపే టకు జనగాం టూ సిద్దిపేట, అదే విధంగా హుస్నాబాద్ నుంచి హనుమకొండకు వయా తరిగొప్పుల నుంచి హను మకొండకు ఒక రూట్ ఉండగా మరో రూట్ ముల్కనూర్, కొత్తకొండ, వేలేరు, మల్లికుదుర్ల, క్యాతంపల్లి, పెద్దపెండ్యాల, హనుమకొండకు ఇంకో రూట్‌లో సైతం వాహనదారులు వెళ్లొచ్చని తెలిపారు.

పెళ్లి ఇష్టంలేక
పురుగుల మందు తాగిన యువతి
చికిత్స పొందుతూ మృతి

నర్సింహులపేట (మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వివాహం చేసుకోవడం ఇష్టంలేక పురుగుల మందు తాగిన ఓ యువతి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. నర్సింహులపేటకు చెందిన మర్రి యాకయ్య- రజిత దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. 15 ఏళ్ల క్రితం భార్యాభర్తల మధ్య విభేదాలతో యాకయ్య వేరుగా ఉంటున్నారు. ఈనెల 14న కూతురు అనూష (20)కు వివాహ సంబంధం నిశ్చయించేందుకు తల్లి రజిత బంధువులతో కలిసి ఖమ్మం వెళ్లారు. తనకు పెళ్లి చేసుకోవడం ఇష్టంలేదని చెప్పినప్పటికీ కుటుంబసభ్యులు వినకపోవడంతో, మనస్తాపం చెందిన అనూష ఇంట్లో ఉన్న పురుగుల మందు అదేరోజు తాగింది. గమనించిన స్థానికులు అనూషను వెంటనే మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. మృతురాలి తల్లి రజిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అనూష (ఫైల్)

పదేళ్లలో ఏం ఒరగబెట్టారో ప్రజలకు చెప్పండి

- వారిని మెప్పించి ఆపై సభ జరుపుకోండి
- అంతేకానీ మాపై చిందులు వేయడం సరికాదు
- అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారు
- బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ ముఖ్య నేతల ఫైర్
- రజతోత్సవ సభను బహిష్కరించాలంటూ పిలుపు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి స్వర్ణ, చిత్రంలో ఎమ్మెల్యే నాయిని, తదితరులు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ నేతలు ఏం ఒరగబెట్టారో ప్రజలకు చెప్పి.. వారిని మెప్పించి ఆపై సభను జరుపుకోవాలని, అంతేకానీ అకారణంగా తమపై చిందులు తొక్కడం సరికాదని కాంగ్రెస్ హనుమకొండ, వరంగల్ ముఖ్య నేతలు ఫైర్ అయ్యారు. శుక్రవారం సాయంత్రం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, నగర మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడారు. తొలుత నాయిని రాజేందర్‌రెడ్డి ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను తెలంగాణ ప్రజలు, ఉద్యమకారులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. సభను నిర్వహించుకోవడం వారి ఇష్టమని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, పదేళ్ల అధికారంలో ఉన్న ఆ పార్టీ రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసిందని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి పరంగా ప్రజలకు ఏమి మేలు చేశారో వివరించాలనఇ తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ నేతలు అకారణంగా కాంగ్రెస్ నేతలపై చిందులు వేయడం సరి కాదని, సభను అడ్డుకునే చర్యలకు తాము పాల్పడడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో తమను నిర్బంధించడం, పార్టీ కార్యక్రమాలను అడ్డుకోవడం లాంటి కుట్రలకు బీఆర్ఎస్ పాల్పడిందని తెలిపారు. కొన్ని సంఘటనలు, నిజాలను బయటపెడితే బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేరని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు భ్రమపడుతున్నారని, ఉనికి కోసం సభను నిర్వహిస్తున్నారన్నారు. మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితర నేతలు మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తారంటూ ప్రకటనలు చేయడం హాస్యాస్పదమన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అడ్డంగా సంపాదించిన వేల కోట్లతో సభను నిర్వహిస్తూ.. ప్రజలను రప్పించే పాట్లు పడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని మీడియా ప్రశ్నలకు సమాధానంగా రాజేందర్‌రెడ్డి చెప్పారు. దీనిపై చర్చకు రమ్మంటే ముఖం దాటేస్తున్నారని దుయ్యబట్టారు.

మభ్యపెట్టి అధికారంలోకి రాలేరు : స్వర్ణ

మళ్లీ అధికారంలోకి వస్తామంటున్న బీఆర్ఎస్ నేతలవి దింపుడు కల్లం ఆశలని, అక్రమంగా దోచుకున్న సంపదతో ప్రజలను మభ్యపెట్టి మళ్లీ అధికారంలోకి రాలేరని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ దుయ్యబట్టారు. వరంగల్ నగరాన్ని డల్లాస్‌లా మారుస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులు బీఆర్ఎస్‌లో ఎందుకు ఓటమి చెందారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఓ సర్కస్ లాంటిదని చూసేందుకు ప్రజలకు వస్తారన్నారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు ఏనాడూ ప్రజల బాధలు పట్టించుకోలేదని, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలకు కూడా అపాయింట్‌మెంట్లు ఇవ్వలేదని మండిపడ్డారు. సభకు వచ్చేందుకు ప్రజలు ఇష్టపడకపోయినా..అక్రమంగా సంపాదించిన లక్షల కోట్లతో జనాన్ని తరలించానలి ప్రణాకలు వేశారని, సభకోసం రెండువేల కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ వరంగల్ నగరాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి నిధులు కేటాయిస్తున్నారని, అభివృద్ధిపై మాటలు చెప్పి చేతులు దులుపేసుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుల జరుగుతున్నాయన్నారు. కార్పొరేషన్ పరిపాలన భవనానికి రూ.32 కోట్లు కేటాయించడం, నగరాభివృద్ధి కోసం అడిగిన వెంటనే రూ.323 కోట్లు అత్యవసరంగా విడుదల చేయడంతో పాటు అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, రింగ్ రోడ్డు భూసేకరణ తదితర అభివృద్ధి పనులు వేగవంతం చేస్తున్నట్లు వివరించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్క్ పేరిట రైతుల నుంచి బీఆర్ఎస్ నేతలు భూములు లాగేసుకొని అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. రైతులకు తక్కువ ధరల్లో డబ్బులు చెల్లించి కమీషన్ల పేరిట బీఆర్ఎస్ నేతలు రూ.కోట్లు మింగేశారన్నారు. మాస్టర్‌ప్లాన్-2024 కోరిన వారికి ఆ వివరాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కలెక్టరేట్, కార్పొరేషన్, కుడా కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ నాయకులు బత్తిని శ్రీనివాస్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ, ఫిషర్‌మెన్ కాంగ్రెస్ సభ్యులు మండల సమ్మయ్యతో పాటు రజాలీ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పాలకుర్తి.. మహాకవులు పుట్టిన
పుణ్యభూమి

- సాహిత్య, సాంస్కృతిక పర్యాటకం మొదలైంది
- ప్రముఖ కవులు శంకరమంచి శ్యాంప్రసాద్, పల్లెర్ల రామ్మోహన్‌రావు

పాలకుర్తి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : ఆదికవి పాల్కూరికి సోమనాథుడు, బమ్మెర పోతన వంటి మహాకవులు పుట్టిన పుణ్యభూమి పాలకుర్తి అని ప్రముఖ కవి శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. శుక్రవారం పాలకుర్తిలో పాల్కూరికి సోమనాథుడు స్మృతి వనంతోపాటు శివైక్యం చెందిన స్థలాన్ని, పోతన స్మారక మందిరం, పోతన దున్నిన పొలాలు, మోట తొలిన బావి, లక్కసముద్రం చెరువు, గూడూరులో శాసనంను, వల్మిడీ రామాలయాన్ని ప్రముఖ కవి పల్లెర్ల రామ్మోహన్‌రావు నేతృత్వంలో 23మంది కవులు, సాహితీ వేత్తలు, తెలుగు పండితులతో సాహితీ యాత్రలో భాగంగా సందర్శించారు.

శ్యాంప్రసాద్, రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సోమనాథుడు, పోతన, వానమామలై వరదాచారి, బిరుదురాజు రామరాజు, కాలోజీ నారాయణరావు, దాశరథి సోదరులు, ఇనుగుర్తి ఒద్దిరాజు సోదరులు లాంటి కవి పండితులు చేసిన సాహిత్య సేవలు మరువలేనివన్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలో మహాకవులు పుట్టిన పుణ్యస్థలాలను సందర్శించుకోవడం గర్వంగా ఉందన్నారు. ఈ ప్రాంత చారిత్రక ప్రాశస్త్యాన్ని తెలుసుకొని, ప్రపంచ నలుమూలలకు ప్రచారం చేయడం అవసరం ఎంతైన ఉందన్నారు. సోమనాథ కళాపీఠం ఆధ్వర్యంలో డాక్టర్ రాపోలు సత్యనారాయణ, మార్గం లక్ష్మీనారాయణ కవులకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు.


పాల్కూరికి స్మృతి వనం వద్ద కవులు

కార్యక్రమంలో గిరిజారమణ శర్మ, కట్టా అని, సిద్ధాంతి, రాజశేఖర్ శర్మ, తిరుపతమ్మ, నారజ ఉమాదేవి, డాక్టర్ మాడి పుష్పలత, కమలాకర్, శ్యాంప్రసాద్‌రావు, శ్వేత, నరేష్, అనితాకుమారి, సువర్ణ, శ్రీదేవి, శ్రీలత, సుజాత, తిరుపతయ్య, బలరాం, పుట్టి గిరిధర్, సభాపతి, చంద్రమౌళి, పుష్పలత, రామన్న శివాచార్య, సునిల్ శివాచార్య, ఇమ్మడి దామోదర్, మెరుగు మధు ఉన్నారు.

ఎంఎస్సీ కెమిస్ట్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : ఈనెల 26 నుంచి జరుగాల్సిన కాకతీయ యూనివర్సిటీ ఎంఎస్సీ ఇంటి గ్రేటెడ్ కెమిస్ట్రీ 3వ ఏడాది 6వ సెమిస్టర్ పరీక్షలను జూన్ 6కు రీషెడ్యూల్ చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్యలు శుక్రవారం తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 30 లోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు విభాగాధిపతిని సంప్రదించాలని సూచించారు.

30 నుంచి వర్సిటీ హాస్టల్స్, మెస్‌ను మూసివేస్తాం

కేయూ క్యాంపస్ ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ కళాశాలల హాస్ట ల్స్, మెస్‌లను ఏప్రిల్ 30 మధ్యాహ్నం భోజనం తర్వాత నుంచి మూసివేస్తామని కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. మే 1 నుంచి 31 వరకు వేసవి సెలవుల దృష్ట్యా వర్సిటీ ఉన్న తాధికారుల ఆదేశాల మేరకు హాస్టల్స్‌తో పాటు మెస్‌లను క్లోజ్ చేస్తామని వెల్లడించారు. వర్సిటీ హాస్టల్స్ బోర్డర్లు ఏప్రిల్ 30న సాయంత్రం 5 గంటల వరకు హాస్టల్ రూంలు ఖాళీ చేయాలని కోరారు. జూన్ 1 నుంచి పీజీ నాల్గవ సెమిస్టర్ పరీ క్షల కోసం మెస్, హాస్టల్స్‌ను పునఃప్రారంభిస్తామని పేర్కొ న్నారు. విద్యార్థులు వర్సిటీ నియామనిబంధనల మేరకు నడు చుకోవాలని సూచించారు.

శాంతిచర్చలకు ముందుకు రావాలి..
సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న మావోయిస్టు పార్టీ లేఖ

వెంకటాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కొనసాగుతున్న ముట్టడి నిర్మూలన సైనిక చర్యను నిలిపివేసి శాంతిచర్చలకు ముందుకు రావాలని మావోయిస్టు పార్టీ నార్త్-వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో ఇన్‌చార్జి రూపేష్ అలియాస్ తక్కళ్లపల్లి వాసుదేవన్ పేరిట లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉన్నప్పటికీ అణచివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని లేఖలో పేర్కొన్నారు. దీని ఫలితంగా బీజాపూర్ - తెలంగాణ సరిహద్దులో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైందని, ఈ ప్రచారాన్ని వెంటనే నిలిపివేసి బలగాలను ఉపసంహరించుకోవాలన్నారు. తుపాకీతో సమస్యను పరిష్కరిం చడానికి ప్రభుత్వం అమలుచేస్తున్న కగార్ సైనిక్ ప్రచారాన్ని ఒక నెల పాటు వాయిదా వేయాలని ఆయన లేఖలో కోరారు.

బాబోయ్ ఎండలు

- పగలంతా అత్యధిక ఉష్ణోగ్రతలు
- మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో 43 డిగ్రీల పైనే
- మరో మూడు రోజులు ఇదే పరిస్థితి
- ఆరెంజ్ అలెర్ట్ జారీ



హనుమకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో సూర్యుడి సూర్రుమంటున్నాడు. నగటు ఉష్ణోగ్రత 43 డిగ్రీల కన్నా తగ్గడం లేదు. మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఎండలు మరింతగా మండిపోతున్నాయి. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా ఉప్పరగూడెంలో అత్యధికంగా 43.4 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో 43.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, హనుమకొండ జిల్లా ములుగు రోడ్డులో 42.9, జనగామ జిల్లాలో 42.8, వరంగల్ జిల్లా ఖిలావరంగల్‌లో 42.6, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 42.5 డిగ్రీల ఉష్ణో గ్రత నమోదైంది. గత అయిదు రోజులుగా గరిష్ఠ ఉష్ణోగ్రత 45 డ్రిగీలకు చేరుకోవడమే కాకుండా రాత్రి వేళల్లో తేమ శాతం ఎక్కువగా ఉండడం వల్ల ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారు. దీనిని వామ్‌నైట్ కండిషన్ అంటారు. ఈ స్థితి ఉమ్మడి జిల్లా అంతటా ఉంది. ఉష్ణోగ్రత 44 డిగ్రీలు ఉన్నప్పటికీ తేమ శాతం అధికంగా ఉంటే ప్రజలు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. ఈ పరిస్థితి మరో మూడు రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొంటున్నారు. వడగాడ్పుల ప్రభావం కూడా ఉంటుందని చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉండడం వల్ల ఆరుబయట పనిచేసే వారు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఎండవేడి నుంచి రక్షణకు తల, శరీర భాగాలను పూర్తిగా కప్పి ఉంచుకోవాలని, ప్రతీ గంటకు ఒకసారి నీడకు వెళ్లి సేద తీర్చుకోవాలని, తరుచూ నీటిని సేవిస్తుండాలని సూచిస్తున్నారు. లేకుంటే శరీరంలోని తేమ శాతం తగ్గిపోయి వడదెబ్బకు గురై డీహైడ్రేషన్ వల్ల ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందంటున్నారు.

సర్జరీలు నిలిచిపోయాయ్!

- వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సేవలు దారుణం
- నెల రోజులుగా ఇదే తీరు
- రోగులు హైదరాబాద్‌కు రెఫర్
- పనిచేయని సెంట్రలైజ్డ్ ఏసీ



దయాలసిస్ వార్డులో ఏసీలు పనిచేయక పోవడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఫెడస్టల్ ఫ్యాన్

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో గత నెల రోజులుగా సర్జరీలు నిలిచిపోయాయి. పేరుకు పెద్ద ఆసుపత్రి అయినప్పటికీ సేవలు మాత్రం దారుణంగా ఉన్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యవసర రోగులను హైదరాబాద్‌కు రెఫర్‌చేస్తూ ఇక్కడి వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం సూపర్ సేవలు స్థానికంగా అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోందని రోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఐదు విభాగాల సేవలు

సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో యూరాలజీ, కార్డియో థొరాసిక్, అంకాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ విభాగాలను ఏర్పాటు చేశారు. ఎండా కాలంలో కిడ్నీ రోగుల కోసం విశిష్టమైన సేవలిందించాల్సిన యూరాలజీ విభాగం సర్జరీలకు స్వస్తి పలికింది. అదే విధంగా మిగతా విభాగాల్లో కూడా నెల రోజులుగా సర్జరీలు నిలిచిపోయాయి. ప్రతి రోజు 145 వరకు ఐదు విభాగాలలో సర్జరీలు జరిగేవి.

ఏసీలు పనిచేయక సర్జరీలు వాయిదా

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో సెంట్రలైజ్డ్ ఏసీలోని చిల్లర్స్ మోటార్ రిపేర్‌కు వచ్చాయి. దీంతో ఈ ఏసీ పనిచేయడం నిలిచిపోయింది. ఆసుపత్రి అధికారులు రూ.10లక్షల వరకు ఖర్చు అవుతుందని నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. నిధులు విడుదల కాక పోవడంతో కొన్ని నెలలుగా ఏసీలు పనిచేయడం లేదు. ఫలితంగా సర్జరీలన్నీ వాయిదా వేస్తున్నట్టు రోగులు వాపోతున్నారు. రోగులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియాకు రెఫర్ చేస్తూ స్థానిక వైద్యులు చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి.

కరెంట్ పోతే అంతే సంగతులు

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స అందించే సమయంలో కరెంట్ పోతే అంతే సంగతులని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు 750 కేవీ జనరేటర్లున్నా ఇందులో ఒకటి రిపేర్‌కు వచ్చినట్టు తెలుస్తోంది. పనిచేస్తున్న ఆ ఒకటిని ఆన్ చేస్తే ఒకదానిపై లోడ్ పడి అది కూడా రిపేర్‌కొచ్చే అవకాశం ఉందని సిబ్బంది చెబుతున్నారు. ఇక వేసవిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు 125 పెడస్టల్ ఫ్యాన్లు, 60 వాల్మౌటెడ్ ఫ్యాన్ల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపారు. కేవలం 10 ఫ్యాన్లు ఉన్నతాధికారులు మంజూరు చేశారని, దీంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు సమాచారం.

డయాలసిస్ రోగులకు శాపం

కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం 10 డయాలసిస్ యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ యంత్రాలతో నిత్యం 30 మందికి డయాలసిస్ చేస్తుంటారు. ఏసీలు పనిచేయక పోవడం వల్ల పెడస్టల్ ఫ్యాన్లతో మిషన్ చల్లబరుస్తూ డయాలసిస్ చేస్తున్నారు. ఫలితంగా డయాలసిస్ మిషన్లు కూడా వేడెక్కి ఏ క్షణాన్నయినా రిపేరుకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆసుపత్రిలోని రోగుల కోసం ఆరు లిఫ్టలను ఏర్పాటు చేయగా ప్రస్తుతం రెండు రిపేర్‌లో ఉన్నాయి. డయాలసిస్ చేయించుకునే రోగులు ర్యాంపు నుంచి వెళ్లాల్సి రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

పోస్ట్ ఆపరేటివ్ వార్డుల్లో ఇబ్బందులు

సర్జరీలు పూర్తి చేశాక రోగులను పోస్ట్ ఆపరేటివ్ వార్డులో ఉంచుతారు. ఇక్కడ ఏసీలు పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా సర్జరీలు నిలిచిపోయాయి. నిత్యం 500కు పైగా ఓపీ, 145కు పైగా మేజర్, మైనర్ ఆపరేషన్లు జరగాల్సి ఉండగా అన్ని వాయిదా పడుతూ వస్తున్నాయి. ఇప్పటికైనా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఆపరేషన్లు లేక బోసిపోయి కనిపిస్తున్న నెఫ్రాలజీ విభాగం



ఏసీలు లేక ఆపరేషన్లు బంద్ కావడంతో మూతపడిన ఆపరేషన్ థియేటర్

గులాబీమయమైన ఎల్కతుర్తి



ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ముస్తాబైన వేదిక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న వివిధ జిల్లాల నేతలు

- ప్రముఖుల రాకతో సందడిగా సభాస్థలి

ఎల్కతుర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వేదికైన ఎల్కతుర్తి గులాబీమయంగా మారింది. మూడు జిల్లాలకు ముఖద్వారంగా ఉన్న ఎల్కతుర్తిలో సభ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఉమ్మడి వరంగల్ నేతలతో పాటు ఇతర జిల్లాల నేతల రాకపోకలతో సభా స్థలి సందడిగా మారింది. సుమారు నెలరోజులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలు సభ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో కేసీఆర్, హరీష్ రావు మినహా మిగతా రాష్ట్ర నాయకులంతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇక ఆదివారం జరిగే సభకు లక్షలాది మంది తరలిరానున్న నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 1,250 ఎకరాలను సభ కోసం సిద్ధం చేయగా.. 169 ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని నిర్మించారు. ఇందులో 500మంది కూర్చునేలా సభా వేదికను తయారుచేశారు. వేదికకు ఓ వైపు కళాకారులు ధూం..ధాం కార్యక్రమాలు చేపట్టడానికి మరో వేదికను సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ స్థలాలను కలుపుకుని 20 భారీ వైర్‌లెస్ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు.

విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా 400 కిలోవాట్స్ సామర్థ్యం గల విద్యుత్ జనరేటర్లను అందుబాటులో ఉంచారు. సభ ప్రాంగణంతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లోనూ గులాబీ జెండాలు రెపరెపలాడుతున్నాయి. ప్రధాన రహదారులకు ఇరువైపుల నాయకుల కటౌట్లు, ఫ్లెక్సీలు, గులాబీ జెండాలతో నింపేశారు.

10 లక్షల మజ్జిగ, 10 లక్షల వాటర్ ప్యాకెట్లు

రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చే ప్రజలకోసం ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టకుని సభ స్థలితో పాటు రహదారులకు ఇరువైపుల తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు నాయకులు తెలిపారు. అలాగే సభకు ఇరువైపులా వేర్వేరుగా మెడికల్ క్యాంపులు, అందుబాటులో డాక్టర్లను నియమించినట్లు తెలిపారు. ప్రధాన రహదారుల్లో నాలుగు వైపులా అంబులెన్స్‌లు సిద్ధం చేశారు. సభ స్థలానికి నాలుగు రోడ్ల నుంచి వచ్చే వాహనాలకు ట్రాఫిక్ జామ్ కాకుండా చూసుకోవడానికి 2 వేల మంది పార్టీ కార్యకర్తలు వాలంటీర్లుగా వ్యవహరిస్తున్నారు. ఇందుకు సంబంధించిన రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేసి అధికారులకు అందజేశారు.

సాయంత్రం 4.30కు ఎల్కతుర్తికి చేరుకోనున్న కేసీఆర్

ఈనెల 27న ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మాజీ సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో సభ స్థలానికి చేరుకోనున్నట్లు సభ నిర్వాహకులు తెలిపారు. కేసీఆర్‌కు పార్టీ నాయకులు స్వాగతం పలికి నేరుగా వేదిక పైకి తీసుకెళ్లనున్నారు. అనంతరం ప్రజలనుద్దేశించి కేసీఆర్ ప్రసంగించి తిరిగి హైదరాబాద్ వెళ్లనున్నారు.

సంరంభానికి.. సన్నద్ధం

(5వ పేజీ తరువాయి)

పార్టీ నేతలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీలు, మునిసిపాలిటీల్లోనూ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. రజతోత్సవ వేడుకలకు రైతులతో పాటు మహిళలు, యువతను భారీగా తరలించేందుకు కసరత్తు చేస్తున్నారు.

గులాబీ నేతల్లో సమన్వయ మంత్రం

రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధిష్ఠానం ఓరుగల్లు గులాబీ నేతల మధ్య ఉన్న విబేదాలపై కూడా ఫోకస్ పెట్టింది. ఇటీవల వరంగల్ పర్యటనకు వచ్చిన కేటీఆర్ మాజీ మంత్రి ఎర్రబెల్లి ఇంట్లో ఐదు గంటలకు పైగా సమీక్ష చేశారు. చిన్నచిన్నవాటిని పట్టించుకోని.. రజతోత్సవ సభకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. అంతేకాకుండా ఎవరికి ఏ నియోజకవర్గాల బాధ్యతలు ఇచ్చారో వాటిపై ఫోకస్ చేయాలని కోరారు. ప్రతీ గ్రామం నుంచి సభకు వచ్చే కార్యకర్తల జాబితా ఇవ్వాలని, 50వేలకు తగ్గకుండా జన సమీకరణ చేయాలని సూచించారు. ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల మధ్య ఉన్న భేదాభిప్రాయాలపై చర్చించి, అందరినీ సమన్వయం చేయటంలో కేటీఆర్ సక్సెస్ అయ్యారనే చర్చ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. మొత్తంగా మాజీ మంత్రితో కొందరు నేతలకు ఉన్న విబేదాలు తాత్కాలికంగా పక్కన పెట్టి సమన్వయంతో పని చేస్తున్నారనే చర్చ జరుగుతుంది.

సభా ప్రాంగణంలో విస్తృత ఏర్పాట్లు

బీఆర్ఎస్ రజతోత్సవాలకు వేదికైన ఎల్కతుర్తి గులాబీమయమైంది. ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 10గంటల వరకు జరిగే బహిరంగ సభకు మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ కీలక నేతలు పాల్గొననున్నారు. 1,250 ఎకరాల్లో రజతోత్సవ సభకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నారు. 169 ఎకరాల్లో సభ ప్రాంగణాన్ని నిర్మించారు. ఈ ప్రాంగణం మొత్తం గులాబీ రంగు జెండాలు, పరదలతో నిండిపోయింది. కేసీ ఆర్, కేటీఆర్‌లతో సెల్ఫీల కోసమని సెల్ఫీ బోర్డులను, మీడియాకోసం వైఫై, భారీ ఎల్ఈడీ స్ర్కీన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 200లకు పైగా జనరేటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక సుమారు వెయ్యి ఎకరాలకు పైగా పార్కింగులకు కేటాయించారు. పార్కింగ్ ప్రాంతాల్లో మొత్తం గులాబీ జెండాలను ఏర్పాటు చేశారు. ఎల్కతుర్తి జంక్షన్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలన్ని గులాబీ ఫ్లెక్సీలు, జెండాలతో గులాబీమయంగా మారుతున్నాయి.



ప్రభబండిని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

కొమ్మాల నుంచి ప్రభబండి

- ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

గీసుగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు గీసుగొండ మండలం కొమ్మాల నుంచి భారీ ప్రభబండిని తరలిస్తున్నారు. శుక్రవారం ఆ ప్రభబండిని కొమ్మాల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆర్చిగేటు వద్ద కొబ్బరికాయ కొట్టి మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు. ఈ క్రమంలో ధర్మారెడ్డి స్వయంగా ఆ ప్రభబండిని నడిపి కార్యకర్తల్లో జోష్ నింపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ హామీల అమలులో ఘోరంగా విఫలమైందని, నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పట్ల ప్రజలు విరక్తి చెంది సీఎంగా మళ్లీ కేసీఆర్‌నే కోరుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చల్లా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు బోడకుంట్ల ప్రకాష్, పుంద్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, గుర్రం రఘు, కంబాల కోటి, సద్ది తిరుపతిరెడ్డి, ధనుంజయ్, జూలూరి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేసింది కేసీఆరే

- గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- మళ్లీ బీఆర్ఎస్ పాలనను ప్రజలు కోరుకుంటున్నారు
- ఎడ్లబండి ర్యాలీలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హసన్‌పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : రైతును రాజు చేసింది కేసీఆరేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవాన్ని పురస్కరించుకొని గ్రేటర్ 65వ డివిజన్ దేవన్నపేటలో శుక్రవారం ఎడ్ల బండి ర్యాలీ నిర్వహించారు. హాజరైన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత తన పదేండ్ల కాలంలో రైతును రాజును చేసిందన్నారు. కేసీఆర్ ఒక విజన్‌తో పని చేస్తే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అవగాహనా రాహిత్యంతో ప్రజలను ఆగం పట్టిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీల అమలు మరిచిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు సంక్షేమం కోసం పని చేస్తామని చెప్పి రైతు వెన్నముక విరిచిందని ఎద్దేవా చేశారు. పింఛన్లు పెట్టింది ఎన్‌టీఆర్ అయితే దాన్ని పెంచి ఆసరా అయ్యింది కేసీఆరేనని అన్నారు.



హసన్‌పర్తి మండలం దేవన్నపేటలో ఎడ్లబండ్ల ర్యాలీలో దప్పుకొడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు



ఎడ్లబండ్ల ర్యాలీలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని వాటికి బిల్లులు చెల్లించడానికి కూడా ఈ ప్రభుత్వం ముందుకు రావడం లేదన్నారు. రైతు బంధు ఎగ్గొట్టిన మోసపూరిత ప్రభుత్వాన్ని ప్రజలు, రైతులు ఛీదరించుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో సీఎంగా మళ్లీ కేసీఆరే రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఎప్పుడు ఎలక్షన్లు వచ్చినా 100 సీట్లు బీఆర్ఎస్ పార్టీకి పక్కా వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రేపు జరగబోయే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దివ్యరాణి రాజునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్, నాయకులు సూరం రాజు, పంజాల భూపాల్, సుదన్, విజేందర్, భాస్కర్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు శనిత్రయోదశి

రుద్రేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

హనుమకొండ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : శనివారం మాస శివరాత్రితోపాటు శనిత్రయోదశి కలిసి రావడం చాలా అరుదుగా జరుగుతుందని ఈ సందర్భంగా రుద్రేశ్వరాలయంలో శనివారం దోష నివారణకై శనేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో అనిల్ కుమార్, ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ తెలిపారు. కుంభం, మీనం, మేషం, వృశ్చిక రాశుల వారికి అర్ధఅష్టమ శని, ఏలిన నాటి శని ఉన్నందున ఈ రాశుల వారు పూజలు నిర్వహించుకోవాలని మిగతా రాశుల వారు కూడా శనేశ్వరునికి ప్రత్యేక పూజలు చేస్తే సత్ఫలితాలు ఉంటాయన్నారు.

జూనియర్, సీనియర్ జడ్జీల బదిలీలు

వరంగల్ లీగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కె.చండీశ్వరిదేవిని యాదాద్రి భువనగిరి జిల్లా జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీచేస్తూ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం ఉత్తర్వులు జారీ చేసింది. శుక్రవారం ఈ మేరకు ప్రకటనజారీచేశారు. చండీశ్వరిదేవి స్థానంలో కుషాయిగూడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న కె.పూజాను నియమించారు.అదేవిధంగా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా రాజేంద్రనగర్‌లో పనిచేస్తున్న ఎస్.అంకిత్‌ను నియమించారు.ఇప్పటి వరకు పరకాల జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న శాలినిలింగంను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో జి.సాయిశరత్‌ను నియమించారు. ఆయన మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జిగా పని చేస్తూ పరకాలకు బదిలీపై వచ్చారు.

మేడారంలో శాశ్వత పనులకు రంగం సిద్ధం

- ప్రణాళికల రూపకల్పనకు ఆర్‌డబ్ల్యూఎస్ చీఫ్ ఇంజనీర్ సురేష్ పర్యటన

తాడ్వాయి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మల మహా జాతరలో శాశ్వత అభివృద్ధి పనుల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించినట్లు మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ కె.సురేష్ అన్నారు. మేడారం పర్యటనలో భాగంగా చేయబోయే పనులను శుక్రవారం అధికారులతో కలిసి తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ 2026 ఫిబ్రవరి నెలలో జరగబోయే సమ్మక్క సారలమ్మల మహా జాతరకు తరలి వచ్చే భక్తులకు శాశ్వత సౌకర్యాలు ఏర్పాటు చేసే దిశగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచనల మేరకు చేపట్టబోయే శాశ్వత పనుల నిర్మాణ పనులకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని అన్నారు. ఈ క్రమంలో మేడారం పరిసర ప్రాంతాలైన చింతల్ క్రాస్ రోడ్డు, కాల్వపల్లి క్రాస్ రోడ్డు, కన్నెపల్లి, చిలకల గుట్ట, జంపవంతెనల వద్ద, ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్, శివరాం సాగర్, పలు ప్రాంతాల్లో పర్యటించి శాశ్వత పనుల ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. శాశ్వత నిర్మాణాల కోసం గుర్తించిన ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణంతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మిం చనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేష్, ఈఈలు, మాణిక్యాలరావు, రామాంజనేయులు, సుభాష్, డీఈలు సునీత, సతీష్, జీవన్ ప్రకాష్, శ్రీనివాస్, మధుకర్, ఏఈలు నవీన్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు నీరందించే వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

- ములుగు వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు
- గ్రామగ్రామాన ప్రపంచ మలేరియా దినోత్సవం



మాట్లాడుతున్న ములుగు జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు

ములుగు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మలేరియా వ్యాధి అంతం మనతోనే సాధ్యమవుతుందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పూర్కరించుకొని ఏర్పాటు చేసిన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం తన కార్యాలయంలో సిబ్బందితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కీటక జనిత నియంత్రణాధికారి చంద్రకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

● కాటారం: ఏటా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాదిమంది మరణాలకు కారణమయ్యే మలేరియా వ్యాధి నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్ర మంలో హెచ్‌ఈవో స్వామి, పీహెచ్‌సీ సిబ్బంది రైసా, సాగర్, శామ్యూల్, వెంకటయ్య, ఆశా కార్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మలేరియా నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని, మలేరియాను పూర్తిగా నిర్మూలించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంత్రికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఏటూరునాగారం సామాజిక వైద్యశాల నుంచి మలేరియా నిర్మూలనకై ర్యాలీ నిర్వహించారు. ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌వో కాంత్రికుమార్ ఆధ్వర్యంలో సాగిన ఈ ర్యాలీ సామాజిక వైద్యశాల నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు కొనసాగింది. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

● మంగపేట : మండలంలోని చుంచుపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సదర్భంగా గ్రామంలోని పలు వీదులల్లో అవగహన ర్యాలిని నిర్వహించి పలురకాల నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారిని యమున మాట్లాడారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ శైలజ, హెచ్‌వీ పద్మలతో పాటు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గోన్నారు.

● కన్నాయిగూడెం(ఆంధ్రజ్యోతి) మండలం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అభినవ్ భాగవతులు ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలి నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ అన్మిష , సుజాత పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి : ప్రపంచ మలేరియా దినోత్సవ వేడుకలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బంది మండలకేంద్రంలోని పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, సూపర్‌వైజర్లు సునీత, సంపూర్ణ, సిబ్బంది సరిత, కల్పన, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● వాజేడు : పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉంటామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నిర్వహించి మలేరియా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. మలేరియా వ్యాప్తి చెందకుండా ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. నీటిని నిల్వ ఉంచరాదని తెలిపారు. వైద్యాధికారు లు మహేందర్, మధుకర్, జ్ఞానస, హెచ్‌ఈవో వేణు, హెచ్‌ఎస్ కోటి రెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వేసవి తాపం పెరుగుతున్న నేపథ్యంలో గొత్తికోయగూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొండాయి వైద్యాధికారి హెచ్. ప్రణీత్ కుమార్ సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం మండల పరిధిలోని కొండాయి గొత్తికోయగూడెం గ్రామాల్లో ఆదివాసీలకు ఆయన అవగాహన కల్పించారు. అనంతరం గొత్తికోయగూడెంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను వైద్య సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లూరులో వ్యాపారాలను ఆదివాసీలకే ఇవ్వాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీ నాయకులు

మంగపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానంలో త్వరలో జరిగే బ్రహ్మోత్సవాలలో వ్యాపారాలు నిర్వహించడానికి స్థానిక ఆదివాసీలకే ఇవ్వాలని కోరుతూ ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీకి వినతి పత్రం ఇవ్వడం జరిగిందని ఆదివాసి జేఏసీ మండల అధ్యక్షుడు తాటి విజయ్‌బాబు, మారబోయిన గోవర్ధన్ తదితరులు శుక్రవారం సాయంత్రం మంగపేటలో స్థానిక విలేకరుల సమక్షంలో తెలిపారు. దేవస్థానం ఈవో ఆదివాసీలకు ఇవ్వకుండా గిరిజనేతరులకు ఇవ్వడానికి బహిరంగ వేలం వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాడని తెలిపారు.

సింగంపల్లికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి

మహాముత్తారం, ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగంపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం భూపాలపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ ఇందుకు వినతి పత్రం అందజేశారు. మహాముత్తారం మండల మహిళ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సుజాత అధ్వర్యంలో గ్రామానికి చెందిన మహిళలు డిపో మేనేజర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా సింగంపల్లి, యత్నాం, నిమ్మగూడెం, యామన్‌పల్లి, మహాముత్తారం, నాగారం, రాంపూర్, కమలాపూర్ మీదుగా భూపాలపల్లికి బస్సు వేయాలని కోరారు. బందం సారక్క, తిరుపతి, నగేష్, రాజమ్మ, తులసీ,సాగర్, సుగుణ, మల్లక్క, నాగమణి, సునీత, భాస్కర్, లక్ష్మి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పలిమెలలో సరిహద్దు జిల్లాల వాలీబాల్ టోర్నీ

మహదేవపూర్ రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పలిమెల మండల కేంద్రంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు అంతరాష్ట్ర సరిహద్దు జిల్లాల వాలీబాల్ టోర్నీని నిర్వహించనున్నట్లు పలిమెల ఎస్సై రమేష్ శుక్రవారం తెలిపారు. ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు జిల్లాలు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా, చత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ జిల్లాల్లోని యువత ఈటోర్నీలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. టోర్నమెంట్‌లో గెలుపొం దినవారికి మొదటి బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.10వేలతో పాటు ట్రోఫీలు బహుకరించనున్నట్లు చెప్పారు. ఆసక్తిగల జట్లు ఈనెల 27వ తేదీ సాయంత్రం 5గంటల వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఫీజు లేదని చెప్పారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు మధ్యాహ్న భోజనంతో పాటు దూర ప్రాంతాల వారికి వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. జట్ల రిజిస్ట్రేషన్లను 7396147071, 7306907549 నెంబర్లపై ఫోన్ లేదా వాట్సాప్‌లో చేసుకోవచ్చని పేర్కొన్నారు.

హెల్త్ అసిస్టెంట్లకు ఉత్తమ ఉద్యోగి పురస్కారం

కాటారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):కాటారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న హెల్త్ అసిస్టెంట్లు కాపర్తి రాజు, తేజావత్ సమ్మయ్య ఉత్తమ ఉద్యోగులుగా పురస్కారం అందుకున్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ మధుసూదన్, జిల్లా మలేరి యా అధికారి డాక్టర్ ఉమాదేవి హెల్త్ అసిస్టెంట్లు రాజు, సమ్మయ్యలకు ప్రశంసాపత్రం, మెమొంటోలను అందించారు. వ్యాధుల నియంత్రణలో హెచ్‌ఏలు విశేష కృషి చేస్తున్నందుకు ఉత్తమ ఉద్యోగులుగా గుర్తించి సత్కరించారు.హెల్త్ అసిస్టెంట్లను వైద్యాధికారి మౌనిక అభినందించారు.

సాయిప్రకాశ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

వెంకటాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హత్యకు గురైన చేయూత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు చిడెం సాయిప్రకాశ్ కుటుంబాన్ని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ శుక్రవారం పరామర్శించారు. ముందుగా ఆయన సాయిప్రకాశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్ ఉన్నారు.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

- అఖిలపక్ష, జేఏసీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే లింగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ అఖిలపక్ష, జేఏసీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే లింగయ్య

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జాతీయ అఖిలపక్ష ప్రజా సంఘాల జేఏసీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ చైర్మన్ చందా లింగయ్య అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఆదివాసీ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ అధ్యక్షతన ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి లింగయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ వర్గీకరణ, జీవో నెం 3 పునరుద్ధరణ అంశాలపై కీలక ప్రసంగం చేశారు. 275 జీవో స్థానంలో, జీవో నెంబర్ 3ని తిరిగి అమలులోకి తీసుకురావడం కోసం అదివాసీలు చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అనంతరం ఎస్టీ వర్గీకరణ లేదా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి వెంటనే తొలగించాలనే అంశంపై సమావేశంలో ఆయన విస్తృతంగా చర్చించారు. రాష్ట్ర స్థాయిలో వేధావులు, న్యాయవాదులు, రాజకీయ ప్రజాప్రతినిధులు, ఆదివాసీ సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలతో త్వరలో ఒక మేధో మథన సదస్సును నిర్వహించి, సాధ్యాసాధ్యాలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అంతేకాకండా ప్రజా ఉద్యమం ద్వారా అదివాసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని లింగయ్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ జాతీయ సభ్యులు ఉపేందర్ రెడ్డి, సీపీఐ పార్టీ ములుగు జిల్లా బాధ్యులు బంపాల రవీందర్, ఎంఆర్‌పీఎస్ జాతీయ నాయకులు నెమలి నర్సయ్య, తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, లీగల్ అడ్వైజర్ పొడుగు శ్రీనాథ్‌తో పాటు తుడుందెబ్బ రాష్ట్ర, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ధాన్యం కేంద్రం ఏర్పాటు



తనిఖీ కేంద్రం వద్ద జిల్లా పౌరసరఫరాల మేనేజరు శ్రీరాంపతి

వాజేడు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరులో శుక్రవారం అంతర్రాష్ట్ర ధాన్యం కేంద్రంను ఏర్పాటు చేశారు. జిల్లా పౌరసరఫరాల మేనేజరు శ్రీరాంపతి, తహసీల్దార్ ఎస్ శ్రీనివాస్‌లు తనిఖీ కేంద్రంను ప్రారంభించారు. చత్తీసగడ్ రాష్ట్రం నుంచి తెలంగాణలోకి వచ్చే వరి ధాన్యం వాహనాలను తనిఖీ చేసి నిలుపుదల చేయాలని సిబ్బందికి సూచించారు ఆయన వెంట ఏటూరునాగారం నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య, జూనియర్ అసిస్టెంట్ నాగరాజు, మూర్తి, ఉదయ తదితరులు ఉన్నారు.

పిల్లల పెరుగుదలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ములుగు కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల పెరుగుదల, పర్యవేక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా సంక్షేమ అధికారి కె.శిరీష అన్నారు. శుక్రవారం జిల్లాకేంద్రంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సమగ్ర శిశు అభివృద్ధి అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ముందుగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, మరుగుదొడ్ల నిర్మాణం, మంచినీటి వసతి, తదితర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థలో ఉంటే అద్దె భవనాలకు మార్చాలని, పిల్లల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో సీడీపీవోలు ప్రేమలత, విజయ, ఐటీ సమన్వయకర్త చీకుర్తి మహేష్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మమత, బ్లాక్ కో ఆర్డినేటర్లు వెంకటరాజు, ఇమ్మానుయేల్, విజేందర్, శ్రావణి పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలి

వెంకటాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో ఆదివాసీ చట్టాలను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమపరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మే 5న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో నాయకులు తుర్స కృష్ణబాబు, తాటి రాంబాబు నవదీప్, రాజ్‌కుమార్, గోపి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ బహిరంగసభను జయప్రదం చేయాలి



కాటారంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎల్కతుర్తి సభకు పాదయాత్రగా వెళుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

కాటారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని చిద్నెపల్లి, ప్రతాపగిరి గ్రామపంచాయతీల పరిధిలో శుక్రవారం బీఆర్ఎస్ రజతోత్సవ సభ..ఛలో వరంగల్ పోస్టర్లను బీఆర్ఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరిగే పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు బీఆర్ఎస్ శ్రేణులు, తెలంగాణవాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నేతలు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజేందర్, అశోక్, సారంగం, గాంధీ, శంకర్‌రావు, సమ్మయ్య, సంపత్, రమేష్, వేణుగోపాల్, సంతోష్ తదితరులు ఉన్నారు.

●గోవిందరావుపేట : బీఆర్ఎస్‌పార్టీ 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా హనుమకొండ ఎల్కతుర్తి వద్ద ఈనెల 27వతేదీన నిర్వహించే రజతోత్సవ బహిరంగసభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవా రం మండలకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మా ట్లాడారు. సమావేశంలో నాయకులు యుగేంద్రచారి, పాల్గొన్నారు.

● వెంకటాపూర్ : వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలు ఎల్లుండి ప్రారంభం కానున్న నేపథ్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం నుంచి మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు యువత, కార్యకర్తలు పాదయాత్రకు పునుకున్నారు. శుక్రవారం ఉదయం మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జెండా ఏపి ప్రారం భించారు. ఈ నెల27న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరుగనుంది. ఇప్పటికే సభ నిర్వహణకు సంబందించిన ఏర్పాట్లు పూర్తి కాగా, వెంకటాపూర్ మండలం నుంచి ఎల్కతుర్తి వరకు బీఆర్ఎస్ సభకు ములుగు బీఆర్ఎస్ ఇన్‌చార్జి బడె నాగజ్యోతి, వెంకటాపూర్ మాజీ జెడ్‌పీటీసీ సభ్యులు గై రుద్రామాదేవి-అశోక్, మండల అధ్యక్షులు లింగాల రమణారెడ్డి, జాగృతి నాయకులు అంతటి రాముగౌడ్, గ్రంథలయ సంస్థ మాజీ చైర్మన్ గోవింద్ నాయక్, మండల నాయకులు తరలివెళ్లారు.

● మహదేవపూర్ రూరల్ : ఈ నెల 27న ఎల్కతుర్తిలో జరగబోయే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో కోరారు. పార్టీ ఏర్పడి 24 వసంతాలు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించి సభకు తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్సిపేట శివారులో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి తహసీల్దార్ సునీత పట్టుకున్నారు. హనుమకొండ జిల్లా నడికుడ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ట్రాక్టర్‌లో మొగుళ్లపల్లి పెద్దవాగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా పరకాల పట్టణానికి ఇసుక తరలిస్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని అన్నారు. మొగుళ్లపల్లి, వేములపల్లి, పోతుగల్లు గ్రామాల నుంచి ఇసుకను తరలిస్తే వాల్టా చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఆమె హెచ్చరించారు.

బొగ్గు టిప్పర్ కిందకు దూసుకెళ్లిన బైక్

కాటారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):మండలంలోని 353(సీ)జాతీయ రహదారిపై మల్లంపల్లి క్రాస్ సమీపంలో గురువారం రాత్రి రిపేర్‌కు గురై ఆగి ఉన్న బొగ్గు టిప్పర్‌ను బైక్ ఢీకొన్న ప్రమాదంలో భూపాలపల్లికి చెందిన బల్ల సమ్మయ్య గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టిప్పర్‌కు రిపేర్ వచ్చి కదలని పరిస్థితి నెలకొనగా రోడ్డుకు ఓ పక్కన ఆపారు. సమ్మయ్య బైక్‌పై మల్హర్ మండలం రుద్రారం గ్రామానికి వెళ్లి భూపాలపల్లికి తిరిగి వస్తున్నాడు. అటవీ ప్రాంతంలో ఆగి ఉన్న టిప్పర్‌ను గమనించకపోవడంతో బైక్ టిప్పర్ కిందకు దూసుకెళ్లి టిప్పర్ అడుగుభాగంలో ఇరుక్కుని పోయింది. బైక్‌పై ఉన్న సమ్మయ్య టిప్పర్‌ను గుద్దుకోవడంతో ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. ఇతర వాహనదారులు గమనించి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. కాగా రిపేర్ గురైన టిప్పర్‌ను రోడ్డుపైనే నిలిపి సిగ్నల్ లైట్లు వేయకపోవడంతోనే ప్రమాదం జరిగిందని బాధితుడి కుమారుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

ఫారెస్టు బీట్ ఆఫీసర్‌పై సస్పెన్షన్ వేటు

గోవిందరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డ అటవీశాఖ బీట్ అధికారి సస్పెన్షన్‌కు గురయ్యారు. పస్రా రేంజ్ పరిధి మొట్లగూడెం బీట్ అధికారి బి.మధు పస్రా సమీపంలోని చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. వచ్చిపోయే వాహనాల నుంచి పర్యావరణ పరిరక్షణ నిమిత్తం వసూలు చేసే టోల్‌ట్యాక్స్‌లో దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఇటీవల పస్రా రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ ఆకస్మిక తనిఖీలో భాగంగా వాహనదారుల నుంచి బీట్ అధికారి అదనంగా రూ.1600 వసూలు చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయన ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ బీట్ అధికారి మధును సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

నాంచారమ్మ జాతరకు తరలిరావాలి

వెంకటాపూర్, ఏప్రిల్ 25, (ఆంధ్రజ్యోతి):వచ్చేనెల 12న జరిగే నాంచారమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆదివాసి ఎరుకల సంఘం అధ్యక్షులు కేతిరి భిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలోని రామాంజాపూర్ గ్రామంలో ఉన్న ఎరుకల నాంచారమ్మ ఆలయం వద్ద వారు పూజలు నిర్వహించి నాంచారమ్మ జాతర పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజు మే 12న సోమవారం రోజుల జాతర అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. నాంచారమ్మ జాతరకు ఆదివాసి ఎరుకల కులస్థులు అధిక సంఖ్య లో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట ములుగు జిల్లా ఉపాధ్యక్షులు పల్లకొండ భాస్కర్, బంగారయ్య, బాబు, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి సురేష్, సహాయ కార్యదర్శులు దేవర్ల పరమేష్, కేతిరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి గుడి గోపురం ప్రారంభోత్సవం

మంగపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కమలాపురంలో బూర్గంపహాడ్- ఏటూరునాగారం ప్రధాన రహదారి పక్కన పెట్రోల్ బంకు సమీపంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయానికి గోపురం ప్రారంభోత్సవం వైభవంగా శాస్త్రప్రకారంగా జరిగింది. ఆలయ నిర్మాణ వ్యవస్థాపకుడు పబ్బోజు సత్యనారాయణచారి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, కమలాపురం గ్రామాధ్యక్షుడు తుక్కాని శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామ ప్రముఖులు తిరుపతి, నల్లూరి శ్రీనివాసరావు, పి.వెంకట్‌రెడ్డి, జి. చందర్‌రావు, జి. శ్రీనివాసచారీ, ఎలవర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న మురికినీరు తొలగింపు

కాటారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):మండలకేంద్రంలోని మసీదువాడలో రోడ్డుపై నుంచి మురికినీటిని గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులు తొలగించారు. కచ్చా డ్రైన్ తీసి మురికి నీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకున్నారు. శుక్రవారం మసీదువాడలో నెలకొన్న సమస్యపై ఆంధ్రజ్యోతిలో 'రోడ్డుపైకి మురికి నీరు..ప్రజలు బేజారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టారు. ఎంపీవో వీరస్వామి ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సఫీర్‌ఖాన్ సిబ్బందితో మురికినీరు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు చేపట్టారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఆంధ్రజ్యోతికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

గణపసముద్రంలో చేపల సందడి

గణపురం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గణపసముద్రం వద్ద చేపల సందడి నెలకొంది. గత ఏడాది కాలంగా మత్స్యకారులు గణపసముద్రంలో చేపలు పట్టలేదు. శుక్రవారం నుంచే చేపల పట్టడం ప్రారంభమవడంతో చేపల ప్రియులు ఎక్కువగా తీసుకునేందుకు మొగ్గు చూపారు. అంతేకాకుండా కేజీకి రూ. 100తో మత్స్యకారులు విక్రయించడంతో గ్రామస్థులు చేపల కొనుగోలు చేసేందుకు బారులు తీరారు. గణపసముద్రంలో చేపల పట్టడం ఇకపై నిరంతరం కొనసాగుతుందని మత్స్యకారులు తెలిపారు.

పోయిన సెల్‌ఫోన్లు రికవరీ

తాడ్వాయి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడారం, పలు ప్రాంతాలలో పోయిన సెల్‌ఫోన్‌లను పోలీసులు శుక్రవారం రికవరీ చేసి యజమానులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన తరువార పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వారిలో కొందరికి ఫోన్ ట్యాపింగ్ ద్వారా వెతికి యజమానులకు అప్పగించడం జరిగిందన్నారు. బాదరబోయిన రాములుకు చెందిన రూ. 53వేల విలువ గల వన్‌ప్లస్ ఫోన్ వారికి అందించడం జరిగిందన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్సై

గోవిందరావుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సందీప్ కిరాణంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణ కోసం వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కెమెరాలు దొంగతనాలను అరికట్టడంలో కీలకపాత్ర పోషిస్తాయని, తెలిపారు. కార్యక్రమంలో కిరాణషాపు యజమాని యాద సత్యనారాయణ, వ్యాపారులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని దేవునిగుట్ట గొత్తికోయ కుటుంబాలకు పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. గూడెంలోకి కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకుడి రివాల్వర్ లైసెన్స్ రద్దు

ములుగు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ రివాల్వర్‌తో వ్యక్తిని బెదిరించిన కేసులో బీఆర్ఎస్ నాయకుడి రివాల్వర్ రద్దుచేస్తున్నట్లు కలెక్టర్ టీఎస్ దివాకర ఇటీవల ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. బీఆర్ఎస్ ములుగు జిల్లా ఇన్‌చార్జి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పీఆర్‌వో జంగిలి రవితేజను ఓ వ్యక్తి ఓ కేసు విషయమై డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో ఈ నెల 6న రవితేజ సదరు వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు రిపోర్ట్ కలెక్టర్‌కు సమర్పించినట్లు, దీంతో కలెక్టర్ నాలుగు రోజుల క్రితం సదరు వ్యక్తి రివాల్వర్ లైసెన్స్ రద్దు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై డీఎస్పీ రవీందర్‌ను వివరణ కోరగా ఇది జరిగి చాలా రోజులవుతుందన్నారు.

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీలు



శాంతి ర్యాలీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర, వ్యాపారులు

భూపాలపల్లిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పర్యాటకులను చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం రాత్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రాంచందర్, కమిటీ సభ్యులు, వ్యాపార, వాణిజ్య సంస్థల యజమానులు పాల్గొన్నారు. భూపాలపల్లి ముస్లింలు మజీద్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జామ మజీద్ ఏ అబ్బాసియా అధ్యక్షుడు హబీబ్ హుస్సేన్, మజీద్ ఏ రజా అధ్యక్షుడు బాబుమియా, మజీదే యాస్మిన్ అధ్యక్షుడు హుస్సేన్, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలో ముస్లింలు శుక్రవారం ర్యాలీ తీశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహ్లాగంలో జరిగే ఉగ్ర దాడిని ఖండిస్తూ మహదేవపూర్ మండల కేంద్రంలో పెద్ద ఎత్తున ర్యాలీ తీశారు.

● మంగపేట : మండలంలోని రాజుపేట నుంచి రమణక్కపేట వరకు బీజేపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు రావుల జానకీరావు ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండారాపు రోహిత్‌కుమార్, బట్ట సతీష్, ఇందారాపు ప్రతాప్, బట్ట చందర్‌రావు, పాల్గొన్నారు. మంగపేట పాత బస్టాండ్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని శుక్రవారం రాత్రినిర్వహించి నినాదాలు చేశారు.

● ఏటూరునాగారం : అమాయక హిందువులను కాల్చి చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఏటూరునాగారం జామా మస్జిద్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మధ్యాహ్నం సమాజ్ అనంతరం స్థానిక మసీద్ నుంచి సుమారు 250 మంది ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి బస్టాండ్ వరకు సంఘీభావ ర్యాలీ చేపట్టారు.